హరహర మహాదేవ..



శింగనమల: దోన రామేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు

గుంతకల్లు టౌన్ : శివనామస్మరణతో పట్టణంలోని శైవక్షేత్రాలు మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పాతగుంతకల్లు రామలింగేశ్వర స్వామి, కసాపురం రోడ్‌లోని పాతూరు శివాలయం ,చంద్రశేఖరస్వామి, మస్తాన్‌పేట మారెమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. పాతగుంతకల్లు శివాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భక్తాదులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

గుంతకల్లు రూరల్ : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుగ్గ సంగమేశ్వరాలయం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువ జామునే సంగమేశ్వరుడికి రుద్రాభిషేకం చేపట్టారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పవిత్ర స్నానాలను ఆచరించి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పార్వతీ సంగమేశ్వరుల కలాణోత్సవం నేపథ్యంలో ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ కోనేటిలో మంగళ స్నానాలను చేయించి నూతన వధూవరులను వివాహ మహోత్సవానికి సిద్ధం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు నిరంతరాయంగా అన్నదానం చేపట్టారు. నెట్టికంటి ఆంజనేయ స్వామి అనుబంధ దేవాస్థానమైన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏకాదశవార రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలోని శివాలయాలు శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో పోటెత్తాయి. గుత్తిలోని కాశీ విశ్వేశ్వ ఆలయం, నగరేశ్వరాలయం, ఆర్ఎస్‌లోని అయ్యప్ప ఆలయంలోని శివాలయం, గౌతమేశ్వరాలయాల్లో మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో అర్చకులు, వేద పండితులు, పూజారులు అర్చనలు, అభిషేకాలు, నవగ్రహ పూజలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి శివ పార్వతులను దర్శించుకున్నారు.



పెద్దవడుగూరు : అలంకరణలో జోడు లింగాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని మునసలమ్మ కట్టవద్ద ఉన్న అతి పురాతన కాశీ విశ్వేర ఆలయం శివరాత్రి సందర్భంగా భక్తులతో కిక్కిరిసి పోయింది. మహా శివుడు, కాశీవిశాలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నీలాంపల్లి నాగలింగేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా శనివారం మహాశివ రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటంకలో 108 సాలాగ్ర శివలింగాలకు రుద్రాభిషేకం, అర్చనలు, పూజలు చేపట్టారు. గార్లదిన్నె, యర్రగుంట్లలో శివ,పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

యల్లనూరు: శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. శివలింగాలకు భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. యల్లనూరు కోట వీధి, పాతపేట, నిట్టూరు, పాతపల్లి, తిమ్మంపల్లి, చింతకాయమంద తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మేడికుర్తిలో నాటక ప్రదర్శన

మేడికుర్తి గ్రామంలో అవధూత బుచ్చమ్మ ఆలయం వద్ద శివరాత్రిని పురస్కరించుకుని నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుచ్చమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం రాత్రి పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర, నాటక ప్రదర్శన నిర్వహించారు.

పామిడి: స్థానిక భోగేశ్వరాలయం, నగరేశ్వరాలయం, కన్యకా పరమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భోగేశ్వరాలయంలో మహన్యాస పూర్వక ఏకాదశవార రుద్రహోమం వంటి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శవలింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం చేపట్టారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

జీ కొట్టాల గ్రామ శివాలయంలో శనివారం మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామస్తుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులుతో పాటు భక్తాదులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. నాయకులు, శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్, దాసరి కృష్ణ, పసుల నాగరాజు, నల్లప్ప, ధను తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: శింగనమలలోని శివాలయం, దోనరామేశ్వరాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోణరామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ నాగమునెమ్మ, వెంకట్రాముడు, ఎంపీటీసీ కురబ ఉమా, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, ఎన్‌వి నారాయణ, బండి లలిత కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఆదేవిధంగా శివపురం, సీ.బండమీదపల్లి, పెరవలి, జలాలపురం, జూలకాల్వ, ఉల్లికల్లు, సలకంచెరువు, మట్లగొంది, నిదనవాడ, తరిమెల, కల్లుమడి, గుమ్మేపల్లి, ఆకులేడు , లోలూరు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నార్పల: మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.సాయంత్రం పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు రఘువేంద్రశర్మ, మణికంఠశర్మ మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన ఉపవాసం ఉంటూ జాగారణతో పూజలు చేస్తే పుణ్య ఫలం సిద్ధిస్తుందన్నారు. భక్తాదులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

పుట్లూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పుట్లూరు, గూడూరు, చింతకుంట, కడవకల్లు, ఎల్లుట్ల, మడ్డిపల్లి, తదితర గ్రామాల్లోని శివాలయాలలో స్వామికి అభిషేకాలు చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దవడుగూరు : లక్ష్మంపల్లి, మల్లేనిపల్లి, మేడిమాకుపల్లి, చిత్రచేడు, రాంపురం, క్రిష్టిపాడులోని శివాలయాలు శనివారం భక్తులతో కిట కిటలాడాయి. ఆయా ఆలయాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. చిన్నవడుగూరు లో యువకులకు ఇరుసులు ఎత్తే పందేలు, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. జాగరణ కోసం చెక్క భజన పోటీలు నిర్వహించారు.

యాడికి: రాయలచెరువు, చందన, చిక్కేపల్లి, యాడికిలోని శివాలయాలు, కోనుప్పలపాడు రామలింగేశ్వరాలయంలో శనివారం శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



జి.కొట్టాలలో శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న పామిడి వీరా



అశ్వత్థంలో శివపార్వతుల కల్యాణం



బుక్కరాయసముద్రం: అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు



యల్లనూరు : పూజలు అందుకుంటున్న శివుడు



గుత్తి: కాశీ విశ్వేశ్వర ఆలయంలో అభిషేకం



పూజలందుకుంటున్న బుగ్గ సంగమేశ్వరుడు.

బుగ్గ ఆలయంలో భక్తుల సందడి

తాడిపత్రి టౌన్: ఓం నమః శివాయః .. హరహర మహాదేవ.. శంభో శంకరా.. కైలసనాథా.. అంటూ భక్తల నామస్మరణతో బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం మార్మోగింది. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారు, స్వామిని దర్శించుకునేందుకు బారులుదీరారు. ఆలయ ఆవరణంలోని శివలింగానికి భక్తులు క్షీరాభిషేకం, జలాభిషేకం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహించారు. నంది వాహనంపై బుగ్గ రామలింగేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో షామియానాలు, పందిళ్లు వేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పట్టణ, రూరల్ సీఐలు ఆనందరావు, చిన్నపెద్దయ్య, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాసవీక్లబ్ సభ్యులకు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాల ధర్మకర్తల మండలి అధ్యక్షులు పొలిశెట్టి ఆంజనేయులు, బానా నాగేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు అంబటి రాఘవేంద్రారెడ్డి, రమేష్ , హరి ప్రసాద్, భగీరథమ్మ, లక్ష్మీదేవి, చింతల ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను సమీక్షించారు. రమణ మహర్షి ఆశ్రమంలోని ధ్యాన శివుడు, సంజీవనగర్‌లోని గాయత్రీదేవి ఆలయంలో శివపార్వతుల కల్యాణం జరిగింది. గాజుల క్రిష్టప్పవీధిలోని సత్యనారాయణస్వామి, శ్రీనివాసపురంలోని సాయి శివపార్వతుల ఆలయాల్లో శివలింగాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పూజలందుకున్న రాజరాజేశ్వరీదేవి



ఎమ్మెల్యే తనయుడు సాయిప్రతాపరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తనయుడు

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయి ప్రతాపరెడ్డి బుగ్గరామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణేశ్వరి

తాడిపత్రి టౌన్ : స్థానిక శివాలయం రోడ్డులోని అన్నపూర్ణేశ్వరీ దేవి ఆలయంలో శనివారం అమ్మవారు 108 చీరలు, గాజులతో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకం, అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ అనంతరం అన్నప్రసాద వినియోగం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు గృహసారథుల సమావేశం

శింగనమల: మండలంలోని వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ గృహసారథులకు సోమవారం శింగనమల రామాలయం వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని వలంటీర్లు, పార్టీ గృహసారథులు హాజరుకావాలని కోరారు.

కవి నారాయణమూర్తికి ఉత్తమ ప్రశంసాపత్రం

పామిడి: విశాఖపట్నం శ్రీదేవి విజ్ఞాన జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ శనివారం పామిడికి చెందిన కవి కొత్తూరు నారాయణమూర్తికి ఉత్తమ ప్రశంసాపత్రంతో సత్కరించింది. సురభి ఆధ్యాత్మిక తరంగాల అమృతవాహిని సేవారంగంలో విశిష్ట కృషి చేసినందుకు గాను ఈ అవార్డును అందజేసింది. కవి నారాయణమూర్తికి ఉత్తమ ప్రశంసాపత్రం అందడంపై స్థానిక కవితాప్రియులు హర్షం వ్యక్తం చేశారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లి, అబ్బేదొడ్డి గ్రామాల్లో పప్పుశనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏఓ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన తురకపల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో తురకపల్లి, అబ్బేదొడ్డి గ్రామాల్లో అత్యధికంగా పప్పుశనగను రైతులు సాగు చేశారన్నారు. రైతులు పండించిన పప్పుశనగను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,335తో కొనుగోలు చేస్తామన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రైతులతో కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బు మ చేస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పప్పుశనగ పండించిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో వీఏఏ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నార్పల: మండల కేంద్రంలో యాదవుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించబోయే శ్రీ కృష్ణ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరరావు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి మనుగడకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు శ్రీ కృష్ణుడన్నారు. భగవద్గీత ప్రబోధకునిగా, తత్త్వోపదేశకునిగా, దేవదేవునిగా,రాజనీతిజ్ఞునిగా నిలిచిన శ్రీ కృష్ణుడి ఆలయ నిర్మాణం మండల కేంద్రంలో చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్ యాదవ్, గొల్ల సుధాకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ తదితరులు

జిల్లా స్థాయి అండర్-7 చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంతకల్లుటౌన్: ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెంగ్విన్ యాక్టివిటీ క్లబ్ వేదికగా గుంతకల్లులో శనివారం జరిగిన జిల్లా స్థాయి అండర్-7 బాలబాలికల ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో గుంతకల్లు, గుత్తి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. మొత్తం మూడు రౌండ్‌లు నిర్వహించగా బాలుర విభాగంలో గుంతకల్లుకు చెందిన సిబి. సూర్యతేజస్ రెడ్డి చాంపియన్‌గానూ, గుత్తికి చెందిన లక్ష్మీనరసింహ రన్నర్‌గానూ, గుంతకల్లుకు చెందిన మహ్మద్ ఉమర్‌షేక్ తృతీయస్థానంలో నిలిచారన్నారు. బాలికల విభాగంలో అనంతపురానికి చెందిన ఉమ్మె ఐమాన్‌షేక్ చాంపియన్‌గానూ, గుంతకల్లుకు చెందిన విస్వాని అరవ రన్నర్‌గానూ, అనంతపురానికి చెందిన కాశి సమిక తృతీయస్థానంలో నిలిచినట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు టోర్నీ డైరెక్టర్ కర్ణాటకం నాగార్జున, కౌన్సిలర్ కృపాకర్, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ భార్గవి, టోర్నీ చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జునల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.



విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేస్తున్న దృశ్యం

నామినేషన్ దాఖలుకు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ దాఖలుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు డీఎస్పీ జి. ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం డీఎస్పీ తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్ల దాఖలులో నిబంధనలు పాటించాలన్నారు. అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ పోటీ అభ్యర్థులు స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో దాఖలు చేస్తున్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి, నలుగురు ప్రపోజర్లు కలిపి మొత్తం ఐదుగురికి, 3 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. మిగతా వారి వాహనాలకు అనుమతి ఉండదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండడంతో ర్యాలీలు, సభలు, సమావేశాలు నిషేధమన్నారు.

నంది వాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రి టౌన్: స్థానిక బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి అధికార నంది వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పట్టణ పురవీధుల్లో భక్తుల శివ నామస్మరణల నడుమ ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



కల్యాణ మండపానికి స్థలం కేటాయించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఎరుకుల కులస్తులు శుభాకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా కల్యాణ మండప నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని ఎరుకుల సేవా సంఘం నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎరుకుల సేవా సంఘం నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవా సంఘం పట్టణాధ్యక్షుడు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు జి.ప్రభాకర్ మాట్లాడుతూ కల్యాణ మండపానికి, ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు స్థలాలిప్పించాలని విన్నవించారు. ఎమ్మెల్యే వైవీఆర్ సానుకూలంగా స్పందించడం పట్ల కులపెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.రామలింగప్ప, ఎరుకుల సేవాసంఘం పట్టణ గౌరవ అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వరప్రసాద్, కోశాధికారి నాగరాజు, వవేకానంద, గోవిందు, శ్రీరాములు, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పెద్దపప్పూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దక్షిణకాశీగా పేరుగాంచిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో శనివారం వేదపండితులు శివపార్వతుల కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. ఈవేడుకను వీక్షించడానికి వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీచక్రభీమలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామానికి చెందిన వంశీవర్ధన్‌రెడ్డి అనే బాలుడికి శనివారం సీనియర్ న్యాయవాది భాస్కర్‌రెడ్డి రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో ఆసుపత్రి ఖర్చుల కోసం సాయం అందించినట్లు న్యాయవాది తెలిపారు.

చితంబర స్వామి తిరునాల ప్రారంభం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో శనివారం చితంబరస్వామి తిరునాల ప్రారంభమైంది. ఏఓ మహాశివరాత్రి మరుసటి రోజు తిరునాల జరపడం ఆనవాయితీ. ఈసందర్భంగా చితంబరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఉదయం భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

నాగప్పస్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

పుట్లూరు: నాయకునిపల్లి గ్రామంలో శనివారం హజరత్ నాగప్ప దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దర్గాకు చేరుకుని చెక్కర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నబీరసూల్, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాతిదూలం లాగుడు పోటీలు

పామిడి: మండలంలోని పెన్నప్పగుడి వద్ద ఎరిత్రాత, పక్కీరప్ప సాముల 22వ రథోత్సవంలో భాగంగా వంకరాజుకాలువ, నెమళ్ళపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు శనివారం ముగిసాయి. చివరిరోజు ఆరుపళ్ల విభాగం పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈసందర్భంగా ఈ పోటీల్లో విజేత వృషభాల యజమానులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సౌజన్యంతో నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైనవారందరికీ అన్నదానం చేశారు.

రోడ్లపై పశువుల సంచారం



గుత్తి ఆర్ఎస్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం ముందు రోడ్డుపై సంచరిస్తున్న మూగజీవాలు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలోని ప్రధాన రహదారులపై ఇటీవల కాలంలో పశువుల సంచారం అధికమైంది. ఆవులు, ఎద్దులు, ఎనుములు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ సంచరిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్, పోస్టాఫీసు, ఆర్ఎస్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం , పత్తికొండ రోడ్డు తదితర చోట్ల రోడ్లపైనే మూగ జీవాలు సేదతీరుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి అవి రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా గంధం మహోత్సవం

శింగనమల: శింగనమలలో హిందూ-ముస్లింలు కలిసి జరుపుకుంటున్న హాజరత్ సయ్యద్ సాలర్ మసూద్ గాజి గంధం మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రాత్రి దర్గాలో పూల చాందినిని తయారు చేశారు. రాత్రి 2 గంటల నుంచి గంధంను ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకెళ్లారు.

ముగిసిన యుద్ధకళల ప్రత్యేక శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని వీకే భవన్ సమీపంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 20 మంది క్రీడాకారులకు యుద్ధకళల్లో ప్రత్యేక శిక్షణ విజయవంతంగా ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బాల బాలికలకు యుద్ధకళలు, తైక్వాండో, కరాటే విభాగాల్లో నాలుగు రోజులుగా నాల్గో డాన్ బ్లాక్ బెల్ట్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాంతరాజ్ నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ప్రత్యేకంగా హ్యాండ్, లెగ్ మూమెంట్స్, స్ప్రారింగ్ విధానాలలో ప్రత్యేకంగా శిక్షణ అందించారు. అన్ని యుద్ధ విద్యల్లో వారిని తీర్చిదిద్ది ప్రధానంగా ఆత్మరక్షణకు అవసరమయ్యే శిక్షణను అందించారు. గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, పెనుకొండ క్రీడాకారులు హాజరయ్యారు. మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామచంద్ర, అసిస్టెంట్ కోచ్ రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.